క్లుప్తంగా

ఆక్స్‌ఫర్డ్ శాట్ పరీక్షకు విశేష స్పందన

గుంటూరు ఎడ్యుకేషన్‌: బృందావన్‌గార్డెన్స్‌లోని ఆక్స్‌ఫర్డ్ ఐఐటీ-నీట్ అకాడమీ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన స్కొలస్టిక్ అప్టిట్యూడ్ టెస్ట్ (ఓ-శాట్)కు మూడు వేల మంది విద్యార్థులు హాజరైనట్లు ఆక్స్‌ఫర్డ్ విద్యా సంస్థల డైరెక్టర్ ఎస్.విజయభాస్కర్ రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. ఫలితాలను డిసెంబర్ రెండో తేదీన విడుదల చేసి, ప్రతిభ చూపిన విద్యార్థులకు ఆక్స్‌ఫర్డ్ జూనియర్ కళాశాలలో ప్రవేశాలు కల్పించనున్నట్లు పేర్కొన్నారు.

బ్యాడ్మింటన్ విజేతలకు బహుమతులు



గుంటూరు వెస్ట్(క్రీడలు): వేణు బ్యాడ్మింటన్ అకాడమీలో ఆదివారం నిర్వహించిన 40+ డబుల్స్ పోటీలో విజేతగా డాక్టర్ రవికుమార్, మిత్ర, రన్నర్స్‌గా ఎస్.సుబ్బారావు, ఏసోబు, తృతీయ స్థానంలో వెంకట కృష్ణ, రాజు నిలిచినట్లు కోచ్ వేణు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. విజేతలకు క్లోం హరనాథ్‌రెడ్డి లిమిటెడ్ ఎండీ పి.వేణు గోపాల్ రెడ్డి, శ్రీరామ్ కన్‌స్ట్రక్షన్ పార్ట్‌నర్ మహేష బాబు బహుమతులు అందజేశారు.

టెన్నిస్‌లో మెడల్ సాధించిన డాక్టర్ వై.షేక్‌కు సత్కారం



లక్ష్మీపురం: గుంటూరు ప్రముఖ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్ డాక్టర్ వై.షేక్ ఇటీవల విజయవాడ ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియంలో నిర్వహించిన ఇండియన్ మెడికల్ అసోసియేషన్ నేషనల్ డాక్టర్స్ ఒలంపియాడ్- 2023 టెన్నిస్ డబుల్స్‌లో రన్నర్స్‌గా సిల్వర్ మెడల్ సాధించడం అభినందనీయం అని ప్రభుత్వ ఏప్ లేళ్ల అప్పిరెడ్డి అన్నారు. స్థానిక పట్టాభిపురంలోని మౌలానా అబుల్ కలాం ఆజాద్ షాదిఖానాలో ఆదివారం డాక్టర్ వై.షేక్‌కు అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డాక్టర్ వై.షేక్ అన్ని వర్గాల వారికి ఎంతో సహాయం చేసే వ్యక్తిత్వం కలిగిన వ్యక్తి అన్నారు. అనంతరం డాక్టర్ వై.షేక్‌ను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో నగర మేయర్ కావటి మనోహర్ నాయుడు, ఎమ్మెల్సీ మద్దాళి గిరిధర్, డెప్యూటీ మేయర్ షేక్ సజీల, వక్ఫ్‌బోర్డు చైర్మన్ జిలాని, జిల్లా గ్రంథాలయ చైర్మన్ దేవానంద్, కార్పొరేటర్లు రోషన్, విశ్రాంత ఎక్సైజ్ కమిషనర్ అహ్మద్ షరీఫ్ పాల్గొన్నారు.

శాలివాహనులు ఐక్యంగా పోరాడాలి



గుంటూరు వెస్ట్: రాష్ట్రంలో శాలివాహనులు ఐక్యంగా ఉండి పోరాడాలని అఖిల భారత శాలివాహన సంఘం నాయకుడు శివకుమార్ చౌడా పెట్టి పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక నల్లపాడు రోడ్డులో ఏపీ కుమ్మరి, శాలివాహన సంఘం ఉమ్మడి జిల్లా సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడ్జెట్‌లో ఏటా కనీసం రూ.500 కోట్లు కేటాయించేలా పోరాడాలన్నారు. కులగణలో శాలివాహనులంతా తమ కులాన్ని, వివరాలను నమోదు చేయించుకుని తమ సంఖ్యను ప్రభుత్వాలకు తెలియజేయాలన్నారు. మాజీ ఎమ్మెల్సీ ఐలాపురం వెంకయ్య మాట్లాడుతూ కుల వృత్తులను నమ్ముకుని జీవిస్తున్న శాలివాహనులకు ప్రభుత్వం ఆర్థిక చేయూతనందించి ఆదుకోవాలని కోరారు. సబ్సిడీపై రుణాలు అందించాలన్నారు. కార్యక్రమంలో రాజవరపు రవి, ఐలాపురం భాస్కర శ్రీనివాసరావు, ఇందుర్తి శివన్నారాయణ పాల్గొన్నారు.

ఐదుగురు జూదరుల అరెస్ట్

పెదనందిపాడు: ఐదుగురు జూదరులను అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ అబ్దుల్ రెహమాన్ ఆదివారం తెలిపారు. మండల పరిధిలోని కొప్పర్రు గ్రామంలో పేకాట స్థావరంపై దాడి చేసినట్లు చెప్పారు. జూదరుల నుంచి రూ.5,450ల నగదు స్వాధీన పరుచుకుని, ఐదుగురిని అదుపులోకి తీసుకున్నట్లు ఆయన తెలియజేశారు.

అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా..

- రాష్ట్రంలో సుపరిపాలన అందిస్తున్న ప్రభుత్వం
- ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య
- ఘనంగా భారత రాజ్యాంగం ఆమోదిత దినోత్సవాలు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య



అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులు

పొన్నూరు: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా సమాజంలో సమానత్వం కోసం జగనన్న ప్రభుత్వం కృషి చేస్తోందని, రాష్ట్రంలో సుపరిపాలన అందిస్తోందని ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య అన్నారు. ఆదివారం భారత రాజ్యాంగ దినోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఐలాండ్ సెంటర్‌లోని డాక్టర్ అంబేడ్కర్ విగ్రహానికి ఎమ్మెల్యే రోశయ్య పూలమాల వేసి, నివాళులర్పించారు. ఈ సందర్భంగా సభలో ఎమ్మెల్యే రోశయ్య మాట్లాడుతూ సమాజంలో సమానత్వాన్ని తీసుకురావడం కోసం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, డాక్టర్‌బాబూ జగ్జీవన్ రామ్ వంటి మహనీయులు అహర్నిశలు కృషిచేశారన్నారు. అంబేడ్కర్ కృషి ఫలితంగానే ప్రపంచంలోనే అతిపెద్ద లిఖిత రాజ్యాంగం రూపుదిద్దుకుందన్నారు. రాజ్యాంగ స్ఫూర్తితో రాష్ట్రంలో ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి రాష్ట్రంలో సుపరిపాలన అందిస్తున్నారన్నారు. దళిత, బలహీన వర్గాలకు సముచిత రాజకీయ స్థానం కల్పించారన్నారు. బడుగు బలహీనవర్గాలకు తోడుగా నిలిచిన ముఖ్యమంత్రికి వారంతా అండగా ఉండాలని కోరారు. పొన్నూరులో ప్రసిద్ధిగాంచిన ఐలాండ్ సెంటర్‌ను భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా జై భీమ్ సంస్థ కోరిక మేరకు డాక్టర్. బీఆర్ అంబేడ్కర్ సెంటర్‌గా నామకరణం చేసినట్లు ప్రకటించారు. అనంతరం చేనేత ఉద్యమ కారుడు ప్రగడ కోటయ్య విగ్రహానికి పూలమాలతో నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డు చైర్మన్ ఆకుల వెంకటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ పట్టణ, రూరల్ అధ్యక్షులు ఎంఏ మహమ్మద్, రుద్రపాటి ఆదిశేషులు, నాయకులు మల్లెల రాజు, వట్టిప్రోలు రంగారావు, బొద్దులూరి రంగారావు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా రాజ్యాంగ ఆమోదిత దినోత్సవం

పెదనందిపాడు: రాజ్యాంగ నిర్మాణ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మండల కన్వీనర్ షేక్ ఖాసీం పీరా అన్నారు. భారత రాజ్యాంగ ఆమోద దినోత్సవం సందర్భంగా ఆదివారం ఉదయం పాత బస్టాండ్ సెంటర్‌లో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి, ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ దాసరి పద్మారావు, వైస్ సర్పంచ్ దివ్వి రాంబాబు, పెదనందిపాడు సొసైటీ అధ్యక్షుడు డి.నాగేశ్వరరావు, జేసీఎస్ కన్వీనర్ మేడిద రవి, బండి నాగేశ్వరరావు, గేరా గణేష్ పాల్గొన్నారు. మొవ్వా శ్రీనివాసరావు, స్టాలిన్, పున్నారావు, ఆటో యూనియన్ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఎన్జీ రంగా వర్సిటీలో..

గుంటూరు రూరల్: మనల్ని మనం పరిపాలించుకునేలా దేశ చట్టాలను రూపొందించటానికి రాజ్యాంగం ఎంతో అవసరమని అప్పటి నేతలు అన్ని దేశాల్లో రాజ్యాంగాలను పరిశీలించారని ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ జి.రామారావు అన్నారు. ఆదివారం 74వ రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని రాజ్యాంగ రూపకర్త డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూల మాలలు వేసి, నివాళులర్పించారు. అనంతరం రిజిస్ట్రార్ మాట్లాడుతూ ప్రపంచంలో అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంగా ఒక లిఖిత రాజ్యాంగం కలిగిన దేశంగా భారత్ గుర్తింపు పొందిందన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్ ఆఫ్ ఎక్స్‌టెన్షన్ డాక్టర్ ఎ.సుబ్బరామిరెడ్డి, డీన్ ఆఫ్ స్టూడెంట్స్ అఫైర్ డాక్టర్ పి.సాంబశివరావు, కంట్రోలర్ పీజీ డీన్ డాక్టర్ ఏవీ రమణ, జాయింట్ రిజిస్ట్రార్ ఎం.శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

క్రమశిక్షణతో లక్ష్య సాధనకు కృషిచేయాలి

గుంటూరు రూరల్: ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో లక్ష్యసాధనకు కృషిచేయాలని చిల్డ్రన్ స్పేస్ క్లబ్ ఫౌండర్ జి.కాంతమూర్తి అన్నారు. ఆదివారం క్లబ్ ఆధ్వర్యంలో అంకిరెడ్డిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, జూనియర్ కళాశాలలో రాజ్యాంగ ఆమోద దినోత్సవం నిర్వహించారు. ప్రపంచం గర్వించదగ్గ రాజ్యాంగం మనకు అందించిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ప్రతి ఒక్కరికి మార్గదర్శకుడన్నారు. అంబేడ్కర్ చిత్రపటానికి పూల మాలలు వేసి, నివాళులు అర్పించారు. విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు.

డిప్స్ కళాశాలలో..

గుంటూరు రూరల్: పేద బడుగు బలహీన వర్గాల అభివృద్ధికి రాజ్యాంగ రూపకర్త డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చేసిన కృషి మరువలేనిదని చేబ్రోలు హనుమయ్య ఫార్మసీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.విద్యాధర్ అన్నారు. ఆదివారం చౌడవరం గ్రామంలోని కళాశాలలో రాజ్యాంగ దినోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ భారత రాజ్యాంగ నిర్మాతల గొప్పదనాన్ని కొనియాడారు. ర్యాలీ నిర్వహించారు. రాజ్యాంగ దినోత్సవ ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఎన్ఎస్ఎస్ అధికారి డాక్టర్ జి.సుబ్బారావు పాల్గొన్నారు.

ఘనంగా రాజ్యాంగ ఆమోదిత దినోత్సవం

పెదకాకాని: పెదకాకానిలోని జిల్లా గ్రంథాలయంలో ఆదివారం భారత రాజ్యాంగ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించడం జరిగింది. వేముల విజయ్ కుమార్ అధ్యక్షతన ఈ వేడుకలకు పెదకాకాని గ్రామ పంచాయతీ సర్పంచ్ గోళ్ళ స్వరూప రాణి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం రాజ్యాంగ భారత రాజ్యాంగ పీఠిక చదివి విద్యార్థులతో చదివించారు. సర్పంచ్ గోళ్ల స్వరూపరాణి మాట్లాడుతూ అందరికీ సమాన హక్కులు సమాన అవకాశాలు అనే సిద్ధాంతంతో రాజ్యాంగం రూపుదిద్దుకుందని తెలిపారు. విద్యార్థులకు రాజ్యాంగ దినోత్సవం గురించి విపులంగా వివరించారు. విద్యార్థులకు రాజ్యాంగ ప్రవేశిక పీఠికను చెప్పిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. భారత రాజ్యాంగ సంబంధించిన పుస్తకాలను మరియు అంబేడ్కర్ గారి పుస్తకాల ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఉమెన్స్ హెల్పర్ ఉద్యోగి స్రవంతి, .జ్యోతి తదితరులు పాల్గొన్నారు.



అంబేడ్కర్ చిత్రపటానికి రిజిస్ట్రార్ డాక్టర్ జి.రామారావు నివాళి



ప్రతిజ్ఞ చేస్తున్న ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.విద్యాధర్



అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న షేక్ ఖాసీ పీరా

పాడి రైతుల బోనస్‌లు కాజేసిన ధూళిపాళ్ల

- బోనస్‌లు అడిగితే టీడీపీ నాయకులపైనే దాడి
- రైతులకు వెంటనే కోట్ల రూపాయల బోనస్‌ను చెల్లించాలి
- ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య

పొన్నూరు: ఏళ్ల తరబడి పాడి రైతులకు చెందిన వందల కోట్ల రూపాయల బోనస్‌లు స్వాహా చేసి డీవీసీ ట్రస్ట్‌కు మళ్లించుకుని, దుష్టచారాల పార్టీ (టీడీపీ) నేత ధూళిపాళ్ల నరేంద్ర డీవీసీ హాస్పిటల్ నిర్మించారని ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య ఆరోపించారు. ఆదివారం పట్టణంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే రోశయ్య మాట్లాడారు. డీవీసీ ట్రస్ట్‌కు వచ్చిన విరాళాలను బహిర్గతం చేస్తే ప్రజలకు నిజాలు తెలుస్తాయని అన్నారు. సంగం డెయిరీ ముందు బోనస్‌లు ఇవ్వలేదని పశ్చిమ గోదావరి జిల్లా లింగాపురానికి చెందిన టీడీపీ సర్పంచులు వస్తే..ధూళిపాళ్ల గూండాలు దాడి చేసిన విషయం వాస్తవం కాదా.. బాధితులు పెట్టిన కేసు నిజంకాదా.. అని రోశయ్య ప్రశ్నించారు. వారంలో ఒక రోజు పోలీస్ స్టేషన్‌లో సంతకం పెట్టాలని బెయిల్ ఆర్డర్లో ఉన్నమాట వాస్తవం కాదా అన్నారు. పాడి రైతు ముసుగులో సంగం డెయిరీని స్వాహా చేశారని ధూళిపాళ్లపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా పాడిరైతులకు రావాల్సిన కోట్ల రూపాయల బోనస్‌లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ నాయకులు ఆకుల వెంకటేశ్వరరావు, రుద్రపాటి ఆదిశేషులు, ఎంఏ. మహమ్మద్, బి. రంగారావు, మల్లెల రాజు, వట్టిప్రోలు రంగారావు,పాల్గొన్నారు.

మసీదుల అభివృద్ధికి ప్రతిపాదనలు

- సీఎం వైఎస్ జగన్‌తోనే ముస్లింల సంక్షేమం
- జిల్లా వక్ఫ్ బోర్డు ప్రెసిడెంట్ షేక్ జిలాని



మసీదు వద్ద కరపత్రాలను ఆవిష్కరిస్తున్న షేక్ జిలాని, ముస్లిం మత పెద్దలు

ప్రత్తిపాడు: మసీదులను అభివృద్ధి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపడం జరుగుతుందని జిల్లా వక్ఫ్ బోర్డు ప్రెసిడెంట్ షేక్ జిలాని అన్నారు. వట్టిచెరుకూరు మండలం చమళ్లమూడి, సాపాడు, చింతపల్లిపాడు, ముట్లూరు, లింగంగుంటపాడు గ్రామాల్లో ఆదివారం జిల్లా వక్ఫ్‌బోర్డు ప్రెసిడెంట్ జిలానీ ఆధ్వర్యంలో హర్ దిల్ మే వైఎస్సార్, హమ్ సబ్ జగన్‌కే సాత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. హాజరైన జిలాని ముస్లిం మత పెద్దలు, సోదరులతో మాట్లాడారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. అర్హులైన వారందరికీ అందుతున్నాయా లేదా అన్న వివరాలను తెలుసుకోవడంతో పాటు, అర్హత ఉండీ పథకాలు అందని వారు ఎవ్వరైనా ఉంటే పల్లెకు పోదాం కార్యక్రమంలో సచివాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ముస్లింలకు రాజకీయంగా తగిన ప్రాధాన్యతనిచ్చి, రాష్ట్ర క్యాబినెట్‌లోనూ అవకాశం కల్పించి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సామాజిక సుపరిపాలన సాగిస్తున్నారని గుర్తు చేశారు. మసీదుల్లోని ఇమామ్‌లు, మౌజన్‌లకు ఆర్థిక సాయం అందుతుందా లేదా అన్న వివరాలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో జిల్లా మైనారిటీ సెల్ అధ్యక్షుడు సయ్యద్ అబీబుల్లా, జిల్లా వక్ఫ్‌బోర్డు డైరెక్టర్ పొన్నూరు కరి ముల్లా, ఆయా మసీదుల ముతవల్లీలు, ముస్లిం మత పెద్దలు పాల్గొన్నారు.

ఆర్బీకేలో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



తహసీల్దారు సిద్ధార్థ, ఏవో అరుణకుమారి

వంగిపురం (ప్రత్తిపాడు): రైతు పంట పండుతోంది.. తాము పండించుకున్న పంట దిగుబడులను తీసుకుని కర్షకుడు పట్టణానికి పరుగులు పెట్టే పని లేకుండా పోతోంది. గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాల్లో ఏర్పాటు చేస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారానే దిగుబడులను కొనుగోలు చేస్తుండటంతో అన్నదాతల ఆనందానికి అవధుల్లేకుండా పోతున్నాయి. వంగిపురంలో సుమారు 800 ఎకరాల్లో రైతులు వరిని సాగు చేశారు. రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు స్థానిక రైతు భరోసా కేంద్రంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. కేంద్రాన్ని తహసీల్దార్ జి. సిద్ధార్థ ప్రారంభించారు. ప్రభుత్వం నిర్ణయించిన గిట్టుబాటు ధర ప్రకారం 75 కేజీల బస్తా రూ. 1652 (గ్రేడ్-1), గ్రేడ్-2 రకం 75 కేజీల బస్తా ధర రూ. 1637 చొప్పున కొనుగోలు చేయనున్నట్లు ఏవో అరుణకుమారి తెలిపారు. గ్రామం ముంగిటనే కొనుగోళ్లు చేస్తుండటంతో, అన్నదాతలకు వ్యయప్రయాసలు తప్పనున్నాయని అధికారులు తెలిపారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులు తమ ధాన్యాన్ని కొనుగోలు చేయాలని కోరారు.

ఘనంగా కార్తీక దీపోత్సవం



వడ్లమూడి క్వారీ బాలకోటేశ్వరస్వామి



దీపాలు వెలిగిస్తున్న మహిళలు

చేబ్రోలు: వడ్లమూడి గ్రామంలోని క్వారీ బాలకోటేశ్వరస్వామి దేవస్థానంలో కార్తీక పౌర్ణమి సందర్భంగా ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో భక్తులు శివలింగాకారంలో కార్తీక దీపోత్సవం వేడుకగా జరిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. చేబ్రోలులోని నాగేశ్వర స్వామి దేవస్థానంలో కార్తీక పౌర్ణమి సందర్భంగా జ్వాలా తోరణంను ఘనంగా జరిగింది. పరిసర గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. మహిళలు కార్తీక దీపాలను వెలిగించారు.

ఆలయాల్లో కార్తీక శోభ

ప్రత్తిపాడు: కార్తీక పౌర్ణమి కావడంతో ఆదివారం కోవెలలు కార్తీక శోభను సంతరించుకున్నాయి. నియోజకవర్గ కేంద్రం ప్రత్తిపాడులోని రెడ్ల రామాలయంలో ఓంకారం రూపంలో మహిళలు దీపాలను వెలిగించారు. పలు శైవక్షేత్రాలు, దేవాలయాలలో రకరకాల ఆధ్యాత్మిక ఆకృతులలో మహిళలు ప్రత్యేక పూజలు చేసి, దీపాలు వెలిగించారు. ఓంకారమూర్తికి అత్యంత ప్రీతికరమైన కార్తీకమాసంలో నేటి రోజుకు ఎంతో ప్రత్యేకత ఉంది. కార్తీక మాసంలో వచ్చే పౌర్ణమిని, కార్తీక పౌర్ణమిగా స్తుతిస్తారు. ఈ మాసంలో ప్రతిరోజూ చేసే దీపారాధనలు, పూజలు, పుణ్యస్నానాలకు ఎంతో విశిష్టత ఉంది. అయినప్పటికీ కార్తీక పౌర్ణమి రోజున చేస్తే ఎక్కువ ఫలితం ఉంటుందనేది అందరినమ్మకం. భక్తులు భక్తిప్రపత్తులతో దీపారాధనలు వెలిగించి కోర్కెలు తీర్చమని శివుడిని వేడుకున్నారు.

మంచి పుస్తకాల ఆవిష్కరణ



మంచి పుస్తకాల ఆవిష్కరణలో ఓబులేసు, శివశంకర్, లక్ష్మీనారాయణ

నగరంపాలెం: సాహిత్య ప్రమేయం లేని సమాజం అనారోగ్యానికి గురవుతుందని అరసం నేత, ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఓబులేసు అన్నారు. బృందావన్‌గార్డెన్స్ అన్నమయ్య గ్రంథాలయంలో అభ్యుదయ రచయితల సంఘం (అరసం) ఆధ్వర్యంలో ఆదివారం మంచి పుస్తకాల ఆవిష్కరణ సభ నిర్వహించారు. పులుపుల వెంకటశివయ్య గేయాలు- వ్యాసాలు పుస్తకాన్ని ఓబులేసు, తాపీ ధర్మరావు- జీవితం- రచనలను సాహితీవేత్త డాక్టర్ పాపినేని శివశంకర్, కుందుర్తి కవితా స్రవంతి పుస్తకాలను అరసం రాష్ట్ర కార్యదర్శులు కె.శరత్‌చంద్ర, జ్యోతిశ్రీ ఆవిష్కరించారు. సాహితీవేత్త డాక్టర్ పాపినేని శివశంకర్ మాట్లాడుతూ ప్రాచీన, ఆధునిక సాహిత్యాలకు వారధి తాపీ ధర్మరావు అన్నారు. నేటితరం సాహిత్యకారులు విధిగా ప్రాచీన సాహిత్యాన్ని కూడా అధ్యాయనం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అరసం జాతీయ అధ్యక్షుడు పెనుగొండ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ నేటి తరానికి అభ్యుదయ సాహిత్యాన్ని చేరువ చేసేందుకు ప్రచురణలు కొనసాగిస్తూ, డిజిటల్ ఛానెల్ ద్వారా కూడా సాహిత్య కార్యకలపాలను సమాజానికి చేరువ చేస్తున్నామని అన్నారు. సభకు ఏపీ అరసం సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వల్లూరి శివప్రసాద్ అధ్యక్షత వహించగా మాట్లాడారు.

అనంతరం ఉమ్మడి జిల్లా అరసం కార్యవర్గాన్ని ప్రకటించగా, గౌరవాధ్యక్షునిగా కారసాని రామకృష్ణారెడ్డి, అధ్యక్షుడిగా చెరుకుమల్లి సింగా, ఉపాధ్యక్షులుగా డాక్టర్ గోట్టిముక్కల స్వర్ణలత, గాలి సీతారామయ్య, కనపర్తి బెనహర్ నియమితులయ్యారు.

గుండె ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండాలి

లక్ష్మీపురం: జీవన విధానం, అనారోగ్యకరమైన అలవాట్లు దీర్ఘకాలంలో గుండె ఆరోగ్యాన్ని దెబ్బతీస్తాయని సీనియర్ కార్డియాలజిస్ట్ డాక్టర్ హరిత అన్నారు. స్థానిక అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం ఆరోగ్య సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గుండె జబ్బుల గురించి అవగాహన కలిగి ఉండాలన్నారు. శరీరంలో అన్ని అవయవాలలో గుండె ప్రధానమైనదని, పెద్ద వయస్సులో వచ్చే గుండె జబ్బులు కొన్ని సందర్భాల్లో వారి మానసిక అనారోగ్యం వల్ల కూడా సంభవించే అవకాశం ఉందన్నారు. మనం తీసుకునే ఆహారంలో పీచు పదార్థం ఎక్కువగా ఉండేలా చూసుకోవాలన్నారు. గుండెకు సంబంధించిన రక్తనాళాలలో పూడికలు వాతం ఎక్కువగా ఉంటే బైపాస్ సర్జరీ చేస్తారని, తక్కువగా ఉంటే మందులతో చికిత్స చేయవచ్చన్నారు. ఆయిల్ విషయంలో మనం చాలా జాగ్రత్తలు తీసుకోవాలని ఆలీవ్‌ఆయిల్ శ్రేష్ఠమైనదని సూచించారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు డాక్టర్ హరితను ఘనంగా సత్కరించారు.

కాలం కవుల చేతుల్లో బందీ



పాత గుంటూరు: కాలాన్ని శాసించగల శక్తి కవులకే ఉందని, కాలం కవుల చేతిలో మాత్రమే బందీగా ఉంటుందని మాజీ మంత్రి, జాషువా కళాపీఠం అధ్యక్షుడు డొక్కా మాణిక్యవరప్రసాద్ అన్నారు. బ్రాడీపేటలోని కొరటాల భవన్‌లో ఆదివారం బాపు- రమణ- బాలు కళాపీఠం- నవ్యాంధ్ర రచయితల సంఘం జిల్లాశాఖ ఆధ్వర్యంలో డాక్టర్ రమణ యశస్వి రచించిన 'యశస్వీయ సప్తపదులు' పుస్తకావిష్కరణ, కవిమిత్రుల సంగమం- కవి సమ్మేళనం నిర్వహించారు. డొక్కా మాట్లాడుతూ కాలాన్ని తన గుప్పిటలోకి తెచ్చుకుని వైద్యుడిగా, సాహితీవేత్తగా రెండు పాత్రలను ఏకకాలంలో పోషిస్తున్న విశిష్ట వ్యక్తి డాక్టర్ రమణ యశస్వి అన్నారు. లఘు కవితా ప్రక్రియల ఉద్యమకారుడు, ప్రసిద్ధ సాహితీవేత్త డాక్టర్ రావి రంగారావు 'సప్తపదులు' పుస్తకాన్ని ఆవిష్కరించారు. రంగారావు మాట్లాడుతూ ఆధునిక సాహిత్యంలో మినీ కవితా ప్రక్రియలపాత్ర కీలకమైందన్నారు. సభకు అధ్యక్షత వహించిన ప్రొఫెసర్ యల్లాప్రగడ మల్లికార్జున రావు మాట్లాడుతూ నేడు తెలుగు సాహిత్యంలో అనేక ప్రక్రియలు, పరిణామాలు వస్తున్నాయని చెప్పారు. ఇవి చాలా అవసరమని వివరించారు. సాహిత్యంలో మార్పు అనివార్యం, మంచి మార్పు సాహిత్యాన్ని పదికాలాలు సజీవంగా ఉంచుతుందని అభిప్రాయపడ్డారు. ప్రసిద్ధ కవి కోసూరి రవికుమార్ పుస్తకాన్ని సమీక్షించారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ అధికార భాషా సంఘం సభ్యులు డాక్టర్ కత్తి వెంకటేశ్వర్లు, సాహితీవేత్తలు డాక్టర్ పీవీ సుబ్బారావు, వైహెచ్‌కే మోహన్‌రావు, నవ్యాంధ్ర రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి కలిమిశ్రీ, గుంటూరు జిల్లా శాఖ అధ్యక్షులు డాక్టర్ తూములూరి రాజేంద్ర ప్రసాద్ మాట్లాడారు. పుస్తక రచయిత డాక్టర్ రమణ యశస్వి నూతన కవితా ప్రక్రియ ఉద్దేశాన్ని తెలిపారు. అనంతరం బి.జనార్దనరెడ్డి నిర్వహించిన కవి సమ్మేళనంలో మూడు జిల్లాలకు చెందిన కవులు తమ కవితల్ని వినిపించారు. చిలకలూరిపేటకు చెందిన పి.వి.రమణకుమార్ చదివిన కవితను ఉత్తమ కవితగా ఎంపిక చేసి నగదు బహుమతి, సర్టిఫికెట్, శాలువతో అరసం జాతీయ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ సత్కరించారు.